# సుప్రీంలో టెల్కోలకు షాక్




## వొడాఫోన్, ఎయిర్‌టెల్, టాటా టెలీ పిటిషన్లను కొట్టివేసిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ, మే 19: సుప్రీం కోర్టులో టెలికాం సంస్థలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిలను రద్దు చేయాలని వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీసర్వీసెస్ దాఖలు చేసిన పిటిషన్లను సోమవారం అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. జేబీ పర్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం.. టెల్కోల అభ్యర్థనలను తోసిపుచ్చుతూ అదంతా ఏమీ కుదరదని తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే ఈ పిటిషన్లను భారీ తప్పిదంగా అభివర్ణిస్తూ ఒకింత ఘాటుగా టెలికాం కంపెనీలను న్యాయమూర్తులు మందలించడం గమనార్హం.

**ఇది సరికాదు**

'ఇలాంటి పిటిషన్లు మా ముందుకు రావడంపై మేము నిజంగా దిగ్భ్రాంతికి గురయ్యాం. ఈ అభ్యర్థనలు మమ్మల్ని ఎంతో అసౌకర్యానికి లోనుచేశాయి. ముఖ్యంగా ఓ బహుళజాతి సంస్థ (వొడాఫోన్) నుంచి ఈ తరహా పిటిషన్ వస్తుందని మేము అస్సలు ఊహించలేదు. దీన్ని మేము కొట్టివేస్తున్నాం' అంటూ వొడాఫోన్ తరఫున ఈ కేసులో వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ముకుల్ రోహ్తగీతో సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేగాక ఈ అంశంలో టెలికాం సంస్థలకు సహాయం చేసేలా ప్రభుత్వానికి ఏ రకంగా అడ్డు రాబోమని కూడా స్పష్టం చేసింది. నిజానికి జూలైదాకా ఈ కేసును వాయిదా వేయాలని రోహ్తగీ విచారణ సందర్భంగా కోర్టును కోరారు. అయితే అందుకు కారణాన్ని కోర్టు చెప్పాలనడంతో.. ఈ సమస్యకు పరిష్కారం కోసం కోర్టు వెలుపల ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ, వొడాఫోన్ ఐడియాలో దాదాపు 50 శాతం భారత ప్రభుత్వానికి వాటా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. దీంతో 'ఒకవేళ ప్రభుత్వం మీకు సాయం చేయాలనుకుంటే చేసుకోవచ్చు. అందుకు మేము అడ్డు రాము. కాబట్టి ఇక ఈ కేసులో వాయిదాలకు తావులేదు' అంటూ అన్ని పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. చివరకు పిటిషన్ ఉపసంహరణకూ అంగీకరించలేదు. కాగా, 2021 జూలైలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వల్ల ఈ విషయంలో సాయానికి కేంద్ర ప్రభుత్వానికి వీల్లేకుండాపోతున్నదని రోహ్తగీ వాదించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. ఏజీఆర్ బకాయిల లెక్కింపులో లోపాలున్నాయని, వాటిని సరిచేసేందుకు అవకాశమివ్వాలని టెల్కోలు కోరగా.. 2021 జూలై 23న సుప్రీం కోర్టు తోసిపుచ్చిన విషయం తెలిసిందే.

**షేర్ విలువ ఢమాల్**

సుప్రీం తీర్పుతో స్టాక్ మార్కెట్లలో వొడాఫోన్ ఐడియా షేర్ విలువ తీవ్రంగా నష్టపోయింది. పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి టెలికాం కార్యకలాపాలను భారంగా నడుపుతున్న వొడాఫోన్ ఐడియాకు ఏజీఆర్ బకాయిల విషయంలో కూడా ఊరట లభించకపోవడంతో మదుపరులు అమ్మకాలకు దిగారు. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే 8.41 శాతం మేర సంస్థ షేర్ విలువ దిగజారింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్‌లో రూ.6.75గా ఉన్నది. ఒకానొక దశలోనైతే 12 శాతం నష్టపోవడం గమనార్హం. ఎయిర్‌టెల్ షేర్ విలువ కూడా స్వల్పంగా 0.14 శాతం లాభానికే పరిమితమైంది. కాగా, ప్రభుత్వం తమకు సాయం చేయకపోతే ఇక ఎంతోకాలం టెలికాం సేవలను నడుపలేమని ఇటీవలే వొడాఫోన్ ఐడియా హెచ్చరించిన విషయం తెలిసిందే. పైగా తమ కంపెనీలో కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉన్నదని, ఒకవేళ తాము దివాలా తీస్తే.. సదరు వాటా విలువ సున్నాగా మారిపోతుందని స్పష్టం చేసింది. అంతేగాక ఇప్పటికే ఈక్విటీలోకి మారిన రూ.1.18 లక్షల కోట్ల స్పెక్ట్రమ్ బకాయిలు వసూలుకావన్నది. కాబట్టి తమకు సాయం చేయాల్సిందేనని ఒక రకంగా మోదీ సర్కారును వొడాఫోన్ ఐడియా హెచ్చరించడం గమనార్హం.

### ఇదీ సంగతి..

*వొడాఫోన్ ఏజీఆర్ బకాయిలు దాదాపు రూ.30,000 కోట్లుగా ఉన్నాయి. వీటిలో వడ్డీ, జరిమానా, వడ్డీపై జరిమానా వంటివి ఉన్నాయి. ఇక ప్రస్తుతం సుప్రీంలో వేసిన పిటిషన్ గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కాదు. ఈ బకాయిల రద్దు కోసం మాత్రమే. అయితే బకాయిలు చెల్లించడానికి సంబంధించిన వాయిదాల కాలానికి సైతం వడ్డీ చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం పట్టుబట్టకుండా చొరవ తీసుకోవాలని సుప్రీంను ఈ పిటిషన్‌లో వొడాఫోన్ కోరింది. కానీ ఇవేవీ నెరవేరలేదు. ఇక దేశంలో ఉన్న మూడు ప్రైవేట్ రంగ టెలికాం సంస్థల్లో వొడాఫోన్ ఐడియా కూడా ఒకటి. మొత్తం మార్కెట్‌లో 18 శాతం వాటా దీనిదే. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ భారతీ హెక్సా.. వడ్డీ, జరిమానాలకు సంబంధించి రూ.34,745 కోట్లను రద్దు చేయాలని సుప్రీంను తమ పిటిషన్‌లో అభ్యర్థించింది. 2020 సెప్టెంబర్ 1న ఏజీఆర్ బకాయిలకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు యావత్తు భారతీయ టెలికాం రంగాన్నే ఆర్థికంగా కుదిపేసిందని కూడా పేర్కొన్నది. అయినప్పటికీ కోర్టు తీర్పును సవాల్ చేయలేదని గుర్తుచేస్తూ.. వడ్డీలు, జరిమానాల నుంచి ఊరట కల్పించాలని మాత్రమే కోరుతున్నట్టు వివరించింది. అయినా ఫలితం లేకపోయింది. టెలికాం శాఖకు చెల్లించాల్సిన మొత్తం రూ.93,520 కోట్ల ఏజీఆర్ బకాయిల్లో 10 శాతం 2021 మార్చి 31కల్లా టెలికాం సంస్థలు చెల్లించాలని, 2031 మార్చి 31లోగా ఆ మిగతా 90 శాతం బకాయిలను వార్షిక వాయిదాలుగా చెల్లించాలని 2020 సెప్టెంబర్‌లో సుప్రీం తీర్పునిచ్చిన సంగతి విదితమే.*

# హోండా రెబల్ 500 బైక్



ధర రూ.5.12 లక్షలు

న్యూఢిల్లీ, మే 19: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ హోండా..మరో స్పోర్ట్ బైకును పరిచయం చేసింది. రెబల్ 500 క్రూజర్ పేరుతో విడుదల చేసిన ఈ బైకు ధర రూ.5.12 లక్షలుగా నిర్ణయించింది. 471 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు ట్విన్ ఇంజిన్, ఆరు గేర్‌బాక్స్, ఎల్‌సీడీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ బైకును బుకింగ్ చేసుకున్న వారికి వచ్చే నెల చివరి నుంచి డెలివరి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ బైకు గురుగ్రామ్, ముంబై, బెంగళూరులలో ఉన్న బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ల్లో మాత్రమే లభించనున్నది.

# నయా హ్యుందాయ్ ఐ20

## ప్రారంభ ధర 7.50 లక్షలు



న్యూఢిల్లీ, మే 19: దేశీయ మార్కెట్‌కు నయా ఐ20 మాడల్‌ను పరిచయం చేసింది హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్. దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ రకం ఈ మాగ్నా ఎగ్జిక్యూటివ్ ప్రారంభ ధర రూ.7.50 లక్షలుగా నిర్ణయించింది. ఆరు రకాలుగా లభించనున్న ఈ మాడల్ గరిష్ఠ ధర రూ.9.99 లక్షలు. స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, స్మార్ట్ కీతో పుష్ బటన్ స్టార్ట్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, రియర్ ఏసీ వెంట్స్, డిజిటల్ క్లస్టర్, ఏడు స్పీకర్ సౌండ్ సిస్టమ్, 25.55 సెంటీమీటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటో, రియర్ పార్కింగ్ కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి. 15 ఏండ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన ఈ ఐ20 కార్లు దేశవ్యాప్తంగా 11 లక్షలు అమ్ముడయ్యాయి.

# యూకో బ్యాంక్ మాజీ సీఎండీ గోయల్ అరెస్టు

## రూ.6,210 కోట్ల మనీలాండరింగ్ కేసులో అదుపులోకి..



న్యూఢిల్లీ, మే 19: మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయల్‌ను అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం వెల్లడించింది. గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్నప్పుడు కోల్‌కతా కేంద్రంగా పనిచేస్తున్న కాన్‌కాస్ట్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (సీఎస్‌పీఎల్) కంపెనీకి భారీ మొత్తంలో రుణాలు మంజూరు చేసిన వ్యవహారంలో అవకతవకలు జరిగినట్టు అరోపణలు వచ్చాయి. ఇలా మంజూరైన రుణాల్లో రూ.6,210.72 కోట్లను సీఎస్‌పీఎల్ కంపెనీ దుర్వినియోగం చేసినట్టు ఇప్పటికే సీబీఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. గోయల్, అతని కుటుంబ సభ్యుల నియంత్రణలోని షెల్, డమ్మీ కంపెనీలకు నిధులను మళ్లించినట్టు సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఈడీ అధికారులు గత ఏప్రిల్‌లో గోయల్‌తోపాటు పలువురు ఇండ్లలో దాడులు నిర్వహించారు. ఈ నెల 16న గోయల్‌ను అరెస్టు చేసి, స్పెషల్ ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఈ నెల 21 వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది. సీఎస్‌పీఎల్‌కు రుణాల మంజూరు వ్యవహారంలో గోయల్‌కు భారీ మొత్తంలో లబ్ధి చేకూరినట్టు ఈడీ పేర్కొన్నది. నగదు, స్థిరాస్థులు, విలాస వస్తువులు, హోటల్ బుకింగ్ తదితర రూపాల్లో షెల్ కంపెనీల ద్వారా గోయల్‌కు లబ్ధి చేకూరినట్టు వివరించింది.

## రికార్డు స్థాయికి ఫండ్ల ఆస్తులు

న్యూఢిల్లీ, మే 19: మ్యూచువల్ ఫండ్ ఆస్తులు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. 2024-25లో మ్యూచువల్ ఫండ్ ఆస్తుల విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.65.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈక్విటీ, డెబిట్ మార్కెట్లు నిరుత్సాహంగా ట్రేడవుతుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను ఫండ్లలోకి తరలించడం వల్లనే ఆస్తులు భారీగా పెరుగుతున్నాయని ఆంఫీ పేర్కొంది. మార్చి 2024 నాటికి ఫండ్ ఆస్తుల విలువ రూ.53.40 లక్షల కోట్లుగా ఉన్నది. ఫండ్లలో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య 5.67 కోట్లకు పెరిగారు. సిప్ పెట్టుబడులు 45.24 శాతం అధికమై రూ.2.89 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

# ఈసారి జీడీపీ అంచనాలు మిస్!

- **క్యూ4లో 6.9%, 2024-25లో 6.3 శాతమే: ఇక్రా**




న్యూఢిల్లీ, మే 19: దేశ జీడీపీ వృద్ధిరేటు ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికం (క్యూ4)లో 6.9 శాతంగా నమోదు కావచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సోమవారం అంచనా వేసింది. ఈ క్రమంలోనే మొత్తం గత ఆర్థిక సంవత్సరం (2024-25) 6.3 శాతంగా ఉండొచ్చన్నది. అయితే జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) అంచనా కంటే ఇది తక్కువగా ఉండటం గమనార్హం. 2024-25కుగాను 6.5 శాతం జీడీపీ నమోదు కావచ్చని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్‌ఎస్‌వో అంచనా వేసిన విషయం తెలిసిందే. అయితే ఏప్రిల్-జూన్‌లో 6.5 శాతంగా, జూలై-సెప్టెంబర్‌లో 5.6 శాతంగా, అక్టోబర్-డిసెంబర్‌లో 6.2 శాతంగా జీడీపీ గణాంకాలున్నాయి. దీంతో గత ఆర్థిక సంవత్సరానికిగాను ఎన్‌ఎస్‌వో అంచనా నిజం కావాలంటే.. ఈ జనవరి-మార్చిలో 7.6 శాతంగా జీడీపీ నమోదు కావాల్సిందే. కానీ ఇక్రా అంచనా 6.9 శాతంగానే ఉన్నది. ఈ క్రమంలోనే 2024-25లో దేశ జీడీపీని 6.3 శాతానికే పరిమితం చేసింది. కాగా, ఈ నెల 30న జనవరి-మార్చి త్రైమాసికంతోపాటు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీ గణాంకాలను ఎన్‌ఎస్‌వో విడుదల చేయనున్నది. 2023-24లో దేశ జీడీపీ వృద్ధిరేటు 9.2 శాతంగా ఉన్న సంగతి విదితమే.

# 82 వేల దిగువకు సెన్సెక్స్

## ఐటీ షేర్లలో భారీగా అమ్మకాలు

ముంబై, మే 19: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టపోయాయి. అమెరికా రేటింగ్‌ను తగ్గిస్తూ మూడీస్ తీసుకున్న నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. దీంతోపాటు ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ఒక దశలో 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 271.17 పాయింట్లు నష్టపోయి 82,059.42 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 74.35 పాయింట్లు కోల్పోయి 24,945.45 వద్ద స్థిరపడింది. తీవ్ర ఒడిదుడుకుల మధ్య ప్రారంభమైన సూచీలు చివరి వరకు బేరిష్ ట్రెండ్‌ను కొనసాగించాయి. మధ్యాహ్నం తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా షేర్లు ఒక్క శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, మహీంద్రా, టాటా మోటర్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లె, ఐటీసీ, మారుతి షేర్లు కోల్పోయాయి.
- కానీ, పవర్‌గ్రిడ్, బజాజ్‌ఫైనాన్స్, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కొటక్ బ్యాంక్, అల్ట్రాటెక్, హెచ్‌యూఎల్, టాటాస్టీల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

## చెత్త డబ్బా ల టెండర్ ప్రక్రియలో జాప్యమెందుకో?

- **స్థానికేతర సప్లయర్‌కు కట్టబెట్టడానికే మొగ్గు..?**
- **బల్దియా అధికారుల తీరుపై ఆరోపణలు**



ఏర్పాటు చేయాల్సిన డస్ట్ బిన్‌లు ఇవే

కోల్‌సిటీ, మే 19ః రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో పరిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అధికారులు.. అందుకు సంబంధించి ఆచరణలో మాత్రం శ్రద్ధ చూపడం లేదు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా నగర పాలక పరిధిలోని 50 డివిజన్లలో చెత్త డబ్బాల ఏర్పాటుకు ఏప్రిల్ 6న రూ.25లక్షలతో నగర పాలక సంస్థ టెండర్ ఆహ్వానించింది. స్థానిక కాంట్రాక్టర్లు 25 శాతం మైనస్‌తో టెండర్లు దాఖలు చేసినట్లు తెలిసింది. ఇదే సమయంలో ఇతర ప్రాంతానికి చెందిన ఓ సప్లయర్ సైతం టెండర్‌లో పాల్గొన్నట్లు తెలిసింది. ఐతే సదరు సప్లయర్‌కు స్థానిక నగర పాలక సంస్థ అధికారులతో సత్సంబంధాలు ఉన్న కారణంగా ఆ టెండర్‌ను సప్లయర్‌కే కట్టబెట్టేందుకే మొగ్గు చూపుతున్నట్లు వినికిడి. నిబంధనల ప్రకారం టెండర్లు దాఖలు చేసిన పక్షం రోజుల్లోనే తెరవడం ఆనవాయితీ. కానీ ఈ టెండర్ విషయంలో రెండు నెలలు కావస్తున్నా నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మాత్రం ఉద్దేశ పూర్వకంగానే జాప్యం చేస్తున్నట్లు స్థానిక కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. 50 డివిజన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లలో డస్ట్‌బిన్ల ఏర్పాటుకు బల్దియా ప్రణాళికలు రూపొందించింది. మొదటి విడతగా 70 డస్ట్‌బిన్‌లను కొనుగోలు చేసి వాటిని కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసింది. రెండో విడతగా రూ.25లక్షల అంచనా వ్యయంతో మరో 250 డస్ట్‌బిన్‌ల కొనుగోళ్ల కోసం టెండర్లు పిలిచింది. వీటి కోసం టెండర్లు దాఖలై రెండు నెలలు వస్తున్నా ఇప్పటివరకు తెరవకుండా పనులు ముందుకు సాగకుండా ఇంజనీరింగ్ విభాగం అధికారులు తాత్సారం చేయడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్‌ను రీకాల్ చేసి స్థానికేతర ప్రాంతంకు చెందిన సప్లయర్‌కు ఏలాగైనా ఈ పనులు అప్పగించేందుకే ఇంజనీరింగ్ విభాగం అధికారులు మొగ్గు చూపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయమై నగర పాలక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామన్‌ను వివరణ కోరగా, డస్ట్‌బిన్‌ల కొనుగోళ్లలో ఒకే కంపెనీకి చెందిన వాటిని ప్రతిపాదించడంతో మిగతా కంపెనీల నుంచి ఫిర్యాదులు వస్తున్న కారణంగా ఆ టెండర్‌ను రీకాల్ చేసి మళ్లీ పిలుస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా నగర పాలక సంస్థ పరిధిలో ఇదివరకే పలు అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్ట్ పనులలో అనేక గోల్‌మాళ్లు జరిగినట్లు అపవాదు ఉంది. ఇప్పటికైనా నగర పాలక ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని చెత్త డబ్బాల టెండర్‌లో పురోగతికి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.



### సాగు పనుల్లో రైతుల బిజీ.. బీజీ..

మంథని, మే 19: మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమా పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో రైతులు వానకాలం పంటల సాగు కోసం సిద్ధమవుతున్నారు. ఉదయాన్నే చేన్లు, పొలాల వద్దకు వెళ్లి వ్యవసాయ పనులను చేసుకుంటూ రైతులు బిజీ.. బిజీగా గడుపుతున్నారు. చేన్లు, పొలాలను దుక్కి దున్నుకోవడంతో పాటు చెత్తా, చెదారం లేకుండా శుభ్రం చేసుకుంటారు. పత్తి చేన్లలో ట్రాక్టర్లతో దుక్కి దున్నుకొని సాగుకు సిద్ధం చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు తమ వ్యవసాయ పనులు చేసుకుంటూ వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు.

# జమ్మికుంటలో గం'జాయ్'!

- గమ్మత్తులో చిత్తవుతున్న యువత
- రాత్రుళ్లు రోడ్ల మీద స్వైర విహారం
- ర్యాష్ డ్రైవింగ్‌తో తరచూ ప్రమాదాలు
- ఇటీవల ఓ అధికారిపై చేయి చేసుకున్నారని ప్రచారం?
- గంజాయి అరికట్టాలని ఇటీవల సీపీకి సామాజిక కార్యకర్త ఫిర్యాదు
- పట్టించుకోని అధికారగణం



*గంజాయిపై ఫిర్యాదు చేసేందుకు సీపీని కలిసిన సామాజిక కార్యకర్త శ్రీకాంత్*

జమ్మికుంట, మే 19: గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా జమ్మికుంట మారుతున్నదా..? బంగారు భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాల్సిన యువత గ'మత్తు'కు చిత్తవుతున్నదా..? కట్టడి చేయాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారా..? అంటే ఇటీవల జరిగిన కొన్ని ఘటనలతో అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇటీవల ఓ వ్యక్తిని ఠాణాకు పిలిపించారనే కారణంతో అధికారిపై చేయి చేసుకున్నారనే ప్రచారం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తున్నది. అంతేకాకుండా ఇటీవల జిల్లా పోలీసు కమిషనర్‌ను సామాజిక కార్యకర్త శ్రీకాంత్ కలిసి, యువత మత్తుకు బానిసలుగా మారుతున్నారని, గంజాయిని అరికట్టాలని కోరుతూ వినతి పత్రం అందజేయడం జరుగుతున్న ఘటనలన్నింటికీ ఊతమిస్తున్నది.

పట్టణంలోని ఓ ప్రాంతం అది. ఒకప్పుడు సాధారణంగా బతికే కుటుంబాలు అవి. అకస్మాత్తుగా వారి భూములకు రెక్కలొచ్చాయి. కోట్లు పలుకుతున్నాయి. ఇక డబ్బుకు కొదువేముంది. కుటుంబాలు రాయల్‌గా బతికేందుకు అలవాటు పడ్డాయి. అదే బాటలో అక్కడి యువత ముందుకు సాగుతున్నది. తాగుడుకు అలవాటు పడ్డ యువత, నేడు మాదక ద్రవ్యాల వైపు సాగుతున్నారనే ప్రచారం సాగుతున్నది. రాతుళ్లు ఇష్టారాజ్యంగా తిరగడం, హోటళ్లలో తినడం, ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు చేయడం, ఇదేంటని ప్రశ్నించే వారిపై దాడులకు తెగబడడం ఇక్కడ సర్వసాధారణమైందని తెలిసింది. సదరు వ్యక్తులు కొందరు 'గ్యాంగు'లుగా తయారయ్యారని, వారు చేస్తున్న ఆగడాలు అంతాఇంతా కాదని సమాచారం. గతంలో ఎన్నోసార్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. గంజాయి బ్యాచ్‌లు తాగి, ఊగుతూ, మత్తులో వాహనాలను నడిపిస్తూ కావాలనే అమాయక ప్రజలపైకి తీసుకెళ్లి ప్రమాదాలు చేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఒక్కసారి చేస్తే ప్రమాదం, పదేపదే జరిగితే దానిని ఏమనాలనే..? ప్రశ్నలు వస్తున్నాయి. మున్సిపల్ పరిధిలో ఇలా ఉంటే మండలంలోని ఓ గ్రామంలో మాజీ ప్రజాప్రతినిధి అండతో అక్కడి యువత 'మత్తు'కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది. దొంగతనాలు, మహిళలపై అసభ్య ప్రవర్తనలు ఠాణా వరకు వెళ్లకుండా చేస్తున్నారని తెలిసింది.

***అధికారిపై చేయి చేసుకునే వరకు..?***

గంజాయి మత్తుకు బానిసలైన యువత తరచూ వార్తల్లోకెక్కుతున్నారు. దాడుల్లో, ప్రమాదాల్లో ప్రత్యక్ష, పరోక్షంగా భాగస్వాములుగా ఉంటున్నారని ప్రచారం జరుగుతున్నది. ఇది ఇలా ఉండగా, ప్రమాదాలు జరిగిన తర్వాత నిందితులుగా భావిస్తున్న వ్యక్తులను పట్టుకునే ప్రయత్నంలో పోలీసులపైనే దాడులకు తెగబడడం కలకలం రేపుతున్నది. కేవలం ఠాణాకు పిలిపించారనే కారణంతో ఓ వ్యక్తి తన బైక్‌తో ను స్టేషన్‌లోపలికి వెళ్లి అధికారులు, సిబ్బందిని నానాబూతులు తిట్టినట్లు సమాచారం. అంతేకాకుండా ఓ ఘటనలో అధికారిపై చేయి చేసుకున్నారనే ప్రచారం సర్వత్రా ఆందోళనకు గురి చేస్తున్నది. అనంతరం జరిగిన పరిణామాలు కూడా జమ్మికుంటలో చర్చనీయాంశమైంది. ఈ అసాంఘిక శక్తులకు కొందరు నాయకులు వత్తాసు పలుకుతున్నారని, ఇంతా జరుగుతున్నా అధికారులు 'మామూలు'గా తీసుకోవడం విమర్శలు తావిస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అసాంఘిక శక్తులపై, వారికి సహకరిస్తున్న వ్యక్తులపై కొరడా ఝులిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యువత చెడు మార్గంలో వెళ్లకుండా కట్టడి చేయాలి. మత్తు నుంచి విముక్తుల్ని చేయాలి. లేకుంటే జమ్మికుంట నేరాలకు అడ్డాగా మారే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

# వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



పెటా టీఎస్ పూర్తిస్థాయి కార్యవర్గం

కొత్తపల్లి, మే 19 : వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని జిల్లా పెటా టీఎస్ అధ్యక్షుడు బాబు శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా పెటా టీఎస్ సర్వసభ్య సమావేశం అనంతరం జిల్లా పూర్తిస్థాయి పేట టీఎస్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతనంగా ఏర్పడ్డ పూర్తిస్థాయి కమిటీ సభ్యులు ఎల్లవేళలా సంఘ ప్రతిష్టకు, సమస్యల పరిష్కారానికి తమ వెంట ఉండాలన్నారు. పెటా టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్ నూతనంగా ఏర్పడ్డ పూర్తిస్థాయి కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, మాజీ ఎస్జీఎఫ్ కార్యదర్శి ఆర్ నర్సయ్య, 40 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

***పూర్తిస్థాయి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం***

అసోసియేట్ అధ్యక్షులుగా కే దత్తాత్రి, టీ హరికిషన్, వి.రూపారాణి, పి. శ్రీనివాస్, ఎన్ శ్యామలాదేవి, కె. రమాదేవి, డాక్టర్ పి. శ్రీనివాస్, జి.నిర్మల, ఉపాధ్యక్షులుగా ఎస్ రమేశ్ కుమార్, వి శ్రీలత, ఎం చంద్రశేఖర్, వి సూర్యప్రకాష్, డాక్టర్ యజాజ్ అహ్మద్, బిట్ర శ్రీనివాస్, ఎం రమేశ్, కె వెంకటలక్ష్మి, కోశాధికారిగా డి వీర్‌పాల్, సంయుక్త కార్యదర్శులుగా కె రామానందతీర్థ, బి సత్యనారాయణ, ఇ స్నేహలత, వి ప్రవీణ, బి రాజ్ కుమార్, డి సత్యానంద్, పి ప్రతిమ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిలర్లుగా గిన్నె లక్ష్మణ్, ఆర్ నర్సయ్య, డి వీరన్న, సిహెచ్ శ్రీనివాస రావు, ఎం కృష్ణవేణి ఎన్నిక కాగా, ముఖ్య సలహాదారులుగా ఎల్‌వి రమణ, బి రాజగోపాలాచారి ఎన్నికయ్యారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



*అగ్గిమల్లలో మహేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్*

గొల్లపల్లి, మే 19: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భరోసానిచ్చారు. గొల్లపల్లి మండలంలో అగ్గిమల్ల గ్రామానికి చెందిన రేచవేణి మల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, అదే విధంగా గ్రామానికి చెందిన మహేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధిత కుటుంబ సభ్యులను కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.

# నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

హుజూరాబాద్ టౌన్, మే 19: హుజూరాబాద్ మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20 నుంచి 24 వరకు ఐదు రోజుల ఇన్-సర్వీస్ శిక్షణ ఇవ్వనున్నట్లు మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల వనరుల కేంద్రంలో రిసోర్స్ పర్సన్స్‌తో సమావేశం నిర్వహించి, శిక్షణకు సంబంధించిన అంశాలను చర్చించారు. ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు శిక్షణ లేదని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని, పాల్గొనే వారి హాజరును తెలంగాణ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. కాబట్టి చెక్ ఇన్, చెక్ అవుట్ సమయం చాలా ముఖ్యమన్నారు. జూలై 2025 వరకు ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులకు మాత్రమే శిక్షణ నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు తమ బోధనా సబ్జెక్టు పాఠ్యపుస్తకాలను విధిగా వెంట తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ గాజుల ఆంజనేయులు, పత్తేం శ్రీనివాస్, ముశం సత్యరాజం, దానెంపల్లి శ్రీనివాస్, అల్లి శ్రీనివాస్, తంగేళ్లపల్లి శ్రీనివాస్, దోమల సదానందం, సాహెదా సల్మా పాల్గొన్నారు.

చిగురుమామిడి, మే 19: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఎస్జీటీ ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీటీలకు ఈనెల 20 నుంచి 25 వరకు ఐదు రోజులపాటు వృత్యాంతర శిక్షణ నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి వి. పావని తెలిపారు. మండలంలోని చిన్న ముల్కనూర్ మోడల్ స్కూల్లో ఉదయం 9:30 ప్రారంభమయ్యే శిక్షణకు ఉపాధ్యాయులందరూ సకాలంలో హాజరుకావాలని కోరారు.

### కరెంట్ షాక్‌తో రైతు దుర్మరణం

పెగడపల్లి, మే 19: చెట్ల కొమ్మ లు తొలగిస్తూ ఓ రైతు కరెంట్ షాక్ తో ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదవశాత్తూ 11కేవీ వైర్ తాకి మృత్యుఒడికి చేరాడు. పెగడపల్లి మండలం నంచర్ల గ్రామ సమీపంలోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సోమవారం విద్యుత్ సిబ్బంది వైర్ల కింద చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌ను నిలిపి వేసి పనులు చేస్తున్నారు. కొంత మంది రైతులతో కలిసి వెళ్లిన ఎడ్ల రాజేందర్‌రెడ్డి (43), ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు ఉన్న ఒక చెట్టు తీగను పైకి ఎక్కి తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైన ఉన్న 11కేవీ విద్యు త్ తీగ తాకి షాక్‌తో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో జగిత్యాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. తన భర్తను ఇంటి వద్ద నుంచి కోల రాములు బలవంతంగా అక్కడికి తీసుకెళ్లాడని, ట్రాన్స్ ఫార్మర్ వద్ద కరెంట్ నిలిపి వేయకుండా పనులు చేపట్టడంతో తన భర్త చనిపోయడని రాజేందర్ రెడ్డి భార్య విజయ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ట్రెయినీ ఎస్ఐ రవీందర్‌కుమార్ తెలిపారు. కాగా, విద్యుత్ ఏడీఈ వరుణ్‌కుమార్, ఏఈ మధు, ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, నంచర్ల విండో చైర్మన్ వేణుగోపాల్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

### దళిత ఎంపీని అవమానిచండం సరికాదు

ముత్తారం, మే 19: సరస్వతీ పుష్కరాల ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించకుండా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీనీ అవమానించడం సరికాదని బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్ పేర్కొన్నారు. పెద్దపల్లి లో జరిగిన సభలో కూడా ప్రొటోకాల్ నిబంధన పాటించకుండా గడ్డం వంశీకృష్ణను అవమానించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, అధికారులర వైఖరిని ఖండించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న బీసీలు ఎస్సీలు, ఎస్టీలు ఇకనైనా ఆ పార్టీని వీడాలని హితవుపలికారు. ఇక్కడ బీఎస్పీ నాయకులు ఏట సంపత్, నాయకులు పాల్గొన్నారు